క్లుప్తంగా

పెండింగ్ కేసులు లేకుండా పని చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : పోలీస్ స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా పని చేయాలని ఎస్పీ కె.నరసింహ సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ పని విభాగాల నిర్వహణలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్ రైటర్, ఆన్‌లైన్ నమోదు సిబ్బందికి విధుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు కేసు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. స్టేషన్ హౌజ్ అధికారికి సమన్వయంగా పని చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసిన పూర్వ విద్యార్థులు



సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా మంగళవారం నాగారం మండల కేంద్రానికి చెందిన పూర్వ విద్యార్థులు సూర్యాపేటలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాగారంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని మాజీ మంత్రిని కోరారు. దీంతో ఆయన స్పందించి పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిప్పపల్లి నాగార్జున, కన్నెబోయిన శివకుమార్, కుత్తల వెంకన్న, చిప్పలపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట : ఉపాధ్యాయ వృత్తికి దీర్ఘకాలిక సెలవు పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయుడు శ్రీధర్ దీర్ఘకాలిక సెలవు పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం, చిట్టీల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై పది రోజులు పూర్తయినా చాలా పాఠశాలల్లో తగిన బోధన సిబ్బంది లేరని తెలిపారు. తక్షణమే పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు భీమనపల్లి ప్రకాష్, ఉత్తరాది నితిన్, వీరబాబు, నవీన్ పాల్గొన్నారు.

పత్తి రైతుకు దిగులు

- వర్షాలు ముఖం చాటేయడంతో ఎండిపోతున్న పత్తిచేలు



కోదూరులో మొలకెత్తని పత్తిచేను



మొలవకుండా ఎండిపోయిన గింజ



వాడిపోయిన పత్తి మొక్క

అర్వపల్లి : వరుణుడు ముఖం చాటేయడంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రతి ఏటా 1000 ఎకరాల్లో పత్తిపంట సాగవుతుంది. అయితే ఈ సీజన్‌లో ఈ నెల నందు ఇప్పటి వరకు సరైన వర్షాలు రాకపోవడంతో మండల వ్యాప్తంగా సుమారు 300 ఎకరాల వరకు పత్తిపంట సాగు చేశారు. మిగిలిన రైతులు పత్తి విత్తనాలు నాటడానికి దుక్కులు దున్ని సిద్ధం చేసి పెట్టారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా మండలంలోని కోదూరు, కొత్తగూడెం, చాకలిగూడెం, కొమ్మాల, కుమ్మరిగూడెం, ఉయ్యాలవాడ, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఇప్పటి వరకు సాగు చేసిన పత్తిచేలు వర్షాలు లేక మొలకలు ఎత్తడం లేదు. మొలకెత్తినవి ఎండలకు మాడిపోతున్నాయి. అయితే ప్రస్తుతం సాగైన పత్తిచేలు వర్షాలు లేక ఎండిపోయాయని, వర్షాలు పడగానే మళ్లీ విత్తనాలు నాటాల్సిందేనని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాను



ఈ సీజన్‌లో రెండున్నర ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాను. ఇందుకోసం విత్తనాలు, దున్నకం తదితర ఖర్చులకు రూ. 40వేల వరకు ఖర్చు చేశాను. కానీ వర్షాలురాక పత్తి చేను మొత్తం వాడిపోయింది. ఇప్పుడు వేసిన విత్తనాలు ఇక మొలవవు. వర్షాలు పడితే మళ్లీ రెండోసారి విత్తనాలు వేయాల్సిందే.

– గుండె ఈశ్వర్, రైతు, ఉయ్యాలవాడ

పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భానుపురి : ప్రతి విద్యార్థి పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్ – 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్విజ్ పోటీకి జూలై 1నుంచి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, సెక్టోరల్ అధికారి శ్రావణ్, జనార్దన్, రాంబాబు, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన భవనాల్లో నివాసం ప్రమాదకరం



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట : వర్షాకాలం దృష్ట్యా శిథిలమైన భవనాల్లో నివసించడం ప్రమాదకరమని మున్సిపల్ అధికారులు అన్నారు. మంగళవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్థానిక 21వ వార్డులో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే ఇళ్లలోని తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని తెలిపారు. వీధుల్లో సంచరించే కుక్కల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, పెంపుడు కుక్కలకు బెల్టులు వేయించి, అవసరమైన టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ తిరుమలయ్య, శ్వేత, ఏ.శ్రీను, జూలపాటి నాగయ్య, గౌసుద్దీన్, మనోజ్, యాదగిరి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వం ప్రతి ఒక్కరి గురించి ఆలోచిస్తుంది

- డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రనాయక్

తుంగతుర్తి : ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రతి ఒక్కరి క్షేమం గురించి ఆలోచిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. అనంతరం పీసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని అన్నారు. ప్రజా పాలనలో మహిళలు, రైతులు, రైతు కూలీలు, నిరుద్యోగులు పేదలకు, సబండ వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొండ రాజు, పెద్దబోయిన అజయ్, గౌతమ్ రెడ్డి, మాచర్ల అనిల్, మహిళ కమిటీ అధ్యక్షురాలు పులి సత్తమ్మ, మారగాని వెంకటయ్య, నారాయణదాసు వెంకన్న, హేమ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలం యర్కారంలో ఎమ్మార్పీఎస్ దిమ్మె శంకుస్థాపన కార్యక్రమానికి సమన్వయకర్త చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగతో కలిసి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు మిద్దె శ్రీరాములు మాదిగ, మిద్దె నాగయ్య మాదిగ, కళానేత గంట భిక్షపతి మాదిగ, కొమ్ము భిక్షం మాదిగ, రవి మాదిగ, మిద్దె సైదులు మాదిగ, బొర్ర అనీల్ మాదిగ, బొర్ర రాములు మాదిగ, సైదులు మాదిగ, గుండ్లపల్లి శ్రీరాములు మాదిగ, చింతలపాటి నరసయ్య పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల మురళీధరచార్యులు ఆధ్వర్యంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు, శార్దూల వాహన సేవ, మహా పూర్ణాహుతి, చక్రస్నానము, వసంతోత్సవాలను జరిపించారు. వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న షీటీం ఎస్ఐ, తదితరులు

సూర్యాపేటటౌన్ : సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్ఐ నీలిమ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో షీ టీమ్స్, సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ మత్తు మందులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాల బారినపడొద్దని చెప్పారు. అనంతరం షీటీం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోలి పద్మ, షీ టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి, డబ్ల్యూపీసీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తుంగతుర్తి మండలం కొత్తగూడెం రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



మద్దిరాల రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అదనపు కలెక్టర్



పెన్‌పహాడ్ మండలం అనాజిపురం రైతువేదికలో ముఖాముఖిలో పాల్గొన్న అధికారులు, రైతులు



తిరుమలగిరి : పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నాగారంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, తహసీల్దార్ అయేషా పర్వీన్, ఏఓ అనిషారూహి, ఏఈఓ అనూష, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు : ఎమ్మెల్యే

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వానాకాలం పెట్టుబడి సాయం కింద తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లు అందజేసిందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం, రైతు సంబరాలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా చెప్పినట్లుగానే ఈనెల 16 నుంచి 24 వరకు తొమ్మిది రోజులలో రూ. 9000 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమేష్ బాబు, ఏఓ బాలకష్ణ, ఎమ్మార్వో దయానందం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఝాన్సీరెడ్డి, పులి సత్తెమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తొండ, జలాల్‌పురం రైతు వేదికలలో రైతు నేస్తం ప్రోగ్రాంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని రైతులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఏఈఓ వెంకట్‌రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

రైతు భరోసా కింద 9 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జిమ్మిలాల్, పాలెపు చంద్రశేఖర్, రాపాక సోమేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య అన్నారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసులేటి వెంకట్‌రెడ్డి, బయ్యం వెంకన్న, గుంటకండ్ల ముకుందారెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, కాశీ వెంకటేశ్వర్లు, కొనిరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతనకల్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం దిర్శనపల్లి, తాళ్లసింగారం రైతు వేదికలో నిర్వహించిన రైతు సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, కాంగ్రెస్ నాయకులు భూరెడ్డి సంజీవ రెడ్డి, పాలాయి నాగరాజు, పసుల అశోక్‌యాదవ్, రాచకొండ అయోధ్య, మరాటి రామస్వామి, లింగాల రామచంద్రు, పాండవుల లింగయ్య, బంటు బద్రి, కొరివి గంగయ్య, బొల్క సైదులు, బంటు క్రాంతి, ఉప్పల మురళి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేసినందుకు గాను మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చూస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, నియోజకవర్గ మ హిళ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కుతుబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వం రైతు భరోసా అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ అర్వపల్లిలో మంగళవారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు రెండు వర్గాల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి బాణసంచాలు కాల్చిమిఠాయిలు పంచారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు సైదులు, జలేందర్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్): ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నందుకు మంగళవారం మండలవ్యాప్తంగా పలు రైతు వేదికలలో రైతులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు.

సూర్యాపేట : పెన్‌పహాడ్ మండల కేంద్రంతోపాటు అనాజిపురం, చీదెళ్ల రైతు వేదికల్లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, ఏఈఓలు మురళీ, శ్రావణి, ప్రణయ్, రాకేష్, మార్కెట్ డైరెక్టర్ అడ్డి కేశవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో..



అర్వపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి ఆధ్వర్యంలో..



నూతనకల్ : దిర్శనపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు



మద్దిరాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



ఆత్మకూర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

సంక్షిప్త సమాచారం

దాడులను వ్యతిరేకించాలి

సూర్యాపేట అర్బన్ : ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్‌కు అండదండగా సాగిస్తున్న భయంకరమైన యుద్ధ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

హోటల్‌కు రూ.5000 జరిమానా

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని ఎంజీ రోడ్డులో గల తిరుమల గ్రాండ్ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. అయితే నిలువ ఉన్న ఆహార పదార్థాలు ఉండటంతో హోటల్ యాజమాన్యానికి రూ.5000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలి

సూర్యాపేట : సోలిపేట గ్రామ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సంఘం సభ్యులు మంగళవారం నిరసన తెలిపారు. ఇప్పుడున్న చైర్మన్ చల్లా సురేందర్ రెడ్డి ఎన్నికను రద్దుచేసి కొత్తగా ఓటు ద్వారా కొత్త సంఘాన్ని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ చెరుకు వెంకన్న, గోగిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ డైరెక్టర్ సూరం దామోదర్ రెడ్డి, కందుల అశోక్ రెడ్డి, సూరం సత్యనారాయణరెడ్డి, చెరుకు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీమా యోజన చెక్కు అందజేత

సూర్యాపేట : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బ్యాంకులు కల్పిస్తున్న ఇన్సూరెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బాపూజీ అన్నారు. సూర్యాపేట మండలం రత్నాపురం గ్రామ పంచాయతీకి చెందిన నకిరేకంటి జానమ్మ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో 436 రూపాయల ప్రీమియం చెల్లించింది. అయితే ఆమె గత జనవరి నెలలో దురదృష్టశాత్తు క్యాన్సర్ వల్ల చనిపోయింది. ఈ సందర్భంగా బీమా కింద రూ.2లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును నామిని నకరేకంటి వెంకన్నకు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, విడ్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రసన్న, వెంకటేష్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

అర్వపల్లి : ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్‌లకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ నర్సయ్య, సుంకసారి వెంకటేష్, అధికార ప్రతినిధి ఈదుల రామాంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురుకులాల విద్యాలయాలకు స్థలాలను కేటాయించిన ప్రదేశాలలో సొంత భవనాలను వెంటనే నిర్మించాలని కోరారు.

సమావేశాలను జయప్రదం చేయాలి

సూర్యాపేట: ఈ నెల 25న హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గం, ఆహ్వానితుల సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, నాయకులు బూర వెంకటేశ్వర్లు, తొట్ల ప్రభాకర్, నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

26న జీఎంపీఎస్ జిల్లా మహాసభలు

తిరుమలగిరి : జూన్ 26న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే జీఎంపీఎస్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. మంగళవారం తిరుమలగిరిలో మహాసభల కర పత్రాలను ఆవిష్కరించారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉల్లెందుల సైదులు అన్నారు. గ్రామంలోని పీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు అదే గ్రామానికి చెందిన నున్న యాదగిరి–శైలజ దంపతులు తమ కుమారుడు నిఖిల్ జ్ఞాపకార్థం మంగళవారం బ్యాగులు, నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై జీవితాన్ని ఆగం చేసుకోవద్దు

ఆత్మకూర్(ఎస్) : మద్యం, గుట్కా, గంజాయిలకు అలవాటు పడి యువత తమ జీవితాలను ఆగం చేసుకోవద్దని ప్రభుత్వ టీచర్, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక, పోలీస్ స్టేషన్‌లో ప్రజలతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మద్దిరాల : డ్రగ్స్ నివారణలో భాగస్వాములు కావాలని ఎస్ఐ వీరన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు.

డ్రగ్స్ వినియోగిస్తే భవిష్యత్తు నాశనం

సూర్యాపేట : విద్యార్థులు డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని, వాటిని వినియోగిస్తే భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం అనాజిపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రాల సోమయ్య, పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా తామర పువ్వుల విక్రయంపై డీపీఓ విచారణ

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమంగా చెరువులో తామర పువ్వులు ఓ వ్యక్తికి విక్రయించారని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నారాయణ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వివరాలతో కూడిన నివేదికను 5 రోజుల్లో కలెక్టర్‌కు అందించనున్నట్లు డీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.